సాక్షి
అనకాపల్లి
బుధవారం । 10 । జనవరి । 2024



వంజంగి హిల్స్‌కు అనుమతి

పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌కు 8లో ఈనెల 10వ తేదీ నుంచి పర్యాటకులను అనుమతించనున్నారు.



ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 28.7, కనిష్టం 22.7 నుంచి 23.2, తేమ శాతం 70, గాలి గంటకు 10 నుంచి 13 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నెలాఖరులో వైద్య సిబ్బందికి పదోన్నతులు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ మిషన్‌ను ఈనెలాఖరుకు రోగులకు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్యవిధాన పరిషత్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వైద్యాలయంలో వివిధ విభాగాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సీటీ స్కాన్ మిషన్‌కు కావాల్సిన వైద్యసిబ్బంది నియామకాలు చేపడతామన్నారు. వైద్యశాఖ ఉద్యోగులకు ఈనెలాఖరులో పదోన్నతులు ఉంటాయన్నారు. మత్తు, గైనిక్ వైద్యుల పోస్టులను ఫిబ్రవరి మొదటి వారంలో భర్తీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆర్‌ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక డైరీని ఆవిష్కరించిన డీఎఫ్‌వో లక్ష్మణ్



వార్షిక డైరీని ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో లక్ష్మణ్

నర్సీపట్నం : జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ వార్షిక డైరీని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జి.లక్ష్మణ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు లక్ష్మణ్ డైరీలు అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ మోహన్ కృష్ణ, యూనియన్ నాయకులు సింహాచలం, గోపి, లక్ష్మణ కిరణ్, సంధ్యారాణి పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

విశాఖ సిటీ: భారత్ దర్శన్‌లో భాగంగా 2022 ట్రైనీ ఐఏఎస్ అధికారుల(బ్యాచ్–3) బృందం మంగళవారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించింది. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే బృందానికి స్వాగతం పలికారు. జాతీయంగా కీలకమైన మెరైన్, లాజిస్టిక్స్ సెక్టార్‌లో మౌలిక వసతులపై అవగాహన కోసం ఈ బృందం పోర్టును సందర్శించింది. ఈ సందర్భంగా పోర్టులో జరిగే కార్యకలాపాలు, ఇక్కడి మౌలిక వసతులు, సాంకేతికత, కాలుష్య స్థాయిలు, వాణిజ్య అభివృద్ధిలో పోర్టు పాత్ర వంటి అంశాలను ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. పోర్టులో జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులు, సరుకు రవాణా సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ గురించి తెలుసుకున్నారు.

డిజిటల్ యుగం

సర్కారు బడుల్లో సరికొత్త విధానంలో విద్యాబోధన అమలవుతోంది. కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ విధానంలో బోధన సాగుతోంది. బ్లాక్, గ్రీన్ బోర్డుల ద్వారా బోధనకు విద్యాశాఖ స్వస్తి పలికింది. ఇందుకు ప్రభుత్వం మొదటి విడత నాడు–నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను అందించింది.



తూటిపాలలో స్మార్ట్ టీవీ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా జరుగుతున్న బోధన

- సర్కారు బడుల్లో సరికొత్త విద్యాబోధన
- కార్పొరేట్‌కు దీటుగా అధునాతన విధానం
- ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ తరగతులు
- 440 పాఠశాలల్లో ఆధునిక పరికరాల ఏర్పాటు

మాకవరపాలెం: సర్కారు బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. మొదటగా డిజిటల్ క్లాస్ రూం (డీసీఆర్) ద్వారా బోధన అందించగా.. దీనికి భిన్నంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను జోడించిన ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా బోధన చేసే విధానాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో మొదటి విడతగా నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన 186 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1146 ఐఎఫ్‌పీలను అందించింది. మరో 254 ప్రాథమిక పాఠశాలల్లో 354 స్మార్ట్ టీవీలతో విద్యాబోధన ప్రారంభించింది.

బ్లాక్ బోర్డులతో బోధనకు స్వస్తి

విద్యార్థులకు ఇప్పటివరకు బ్లాక్, గ్రీన్ బోర్డుల ద్వారా సుద్ద ముక్కలతో విద్యా బోధన సాగేది. పాఠం బోధించేందుకు ఉపాధ్యాయులు బోర్డులపై సుద్ద ముక్కలతోనే బోధన సాగించాల్సివచ్చేది. దీనికి స్వస్తి పలుకుతూ ఆరు నుంచి 10వ తరగతి వరకు ఆధునిక సాంకేతికతను జోడించిన ఐఎఫ్‌పీలు, మూడు నుంచి ఐదో తరగతి వరకు బోధనకు స్మార్ట్ టీవీలను ప్రభుత్వం సమకూర్చింది.

ప్రతి తరగతికి ఎన్ని సెక్షన్లు ఉంటే అన్నింటిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని 440 పాఠశాలల్లో ప్యానెల్స్‌తోపాటు స్మార్ట్ టీవీలతోనే విద్యార్థులకు తరగతులు సాగుతున్నాయి. వారికి మరింత చేరువయ్యాయి.

బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల పంపిణీ..

విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించే క్రమంలో ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ప్రత్యేకంగా ట్యాబ్‌లను పంపిణీ చేసింది. జిల్లావ్యాప్తంగా గతేడాది 8వ తరగతి చదువుతున్న 19,250 మందికి ట్యాబ్‌లను అందించగా.. ఈ ఏడాది మరో 15,201 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా మొదటి విడతగా 8,175 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందగా మిగిలినవి త్వరలో పంపిణీ కానున్నాయి.

సులువుగా అర్థం చేసుకోవచ్చు



పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలు అర్థం అవ్వకపోతే ట్యాబ్‌లో కూడా అదే పాఠాన్ని చూసుకోవచ్చు. ప్రభుత్వం ట్యాబ్‌లు అందించడం వల్ల మరొక్కసారి పాఠాన్ని వీడియో ద్వారా వినే అవకాశం కలిగింది. ఇలా పాఠాలను సులువుగా అర్థం చేసుకోవచ్చు.

–జి.వంశీకృష్ణ, 8వ తరగతి విద్యార్థి

సులభంగా బోధన



నూతన డిజిటల్ విధానంలో బోధన సులభతరం అయింది. తక్కువ సమయంలో విద్యార్థులకు ఎక్కువ విషయాలను చెప్పే అవకాశం ఏర్పడింది. అంతే కాకుండా విద్యార్థులకు కూడా ఇట్టే అర్థం అవుతాయి. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీ ద్వారా బోధన మంచి ఫలితాలను ఇస్తుంది.

–కోసూరు రాము, ఉపాధ్యాయుడు తూటిపాల, మాకవరపాలెం మండలం

రెండో విడతగా 1,115 ఐఎఫ్‌పీలు



జిల్లాలో మొదటి విడతగా 440 పాఠశాలలకు 1,146 ఐఎఫ్‌పీలు, 354 స్మార్ట్ టీవీలను అందించాం. రెండో విడతగా మరో 1,115 ఐఎఫ్‌పీలు, 403 స్మార్ట్ టీవీలను అందిచనున్నాం. మొదటి విడతలో మంజూరైన అన్నింటినీ పాఠశాలల్లో ఇన్‌స్టాల్ చేయడంతో డిజిటల్ బోధన సాగుతోంది. త్వరలో రెండో విడతలో అభివృద్ధి జరిగిన నాడు–నేడు పాఠశాలల్లో కూడా ఈ బోధనకు సన్నాహాలు చేస్తున్నాం.

–వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

అప్పన్న దేవస్థానానికి రూ.4.15 లక్షల విరాళం



ఏఈవో నరసింగరావుకి చెక్కు అందజేస్తున్న దాత ఎస్.గురునాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం మాధవదార ప్రాంతానికి చెందిన ఎస్.గురునాథరావు రూ.3.15 లక్షలు, గోసంరక్షణ పథకానికి లక్ష విరాళాన్ని అందజేశారు. మొత్తం 4.15లక్షల విరాళాన్ని చెక్కురూపంలో అన్నప్రసాద పథకం ఏఈవో పాలూరి నరసింగరావుకి అందజేశారు.

11న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 11న నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించే సమావేశాలకు ప్రజా ప్రతినిధులందరికీ ఆహ్వానాలు పంపినట్లు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. 11న ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. 10 గంటలకు రెండో స్థాయీ సంఘం, 10.30 గంటలకు 5వ స్థాయీ, 12 గంటలకు 4, 6వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను సీఈవో సూచించారు.

వెంటాడిన మృత్యువు



దొరబాబు, వీరవేణి (ఫైల్)



ఆస్పత్రి మార్చురీలో ఒకే చోట విగత జీవులుగా భార్యా భర్తలు

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం
- పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద ఘోర దుర్ఘటన

యలమంచిలి రూరల్/కిర్లంపూడి : రెండు దశాబ్దాలకు పైగా అన్యోన్యంగా వున్న ఆ దంపతులను చూసి విధి కన్నుకుట్టింది. కాసేపట్లో ఇంటికి చేరుకుని నిద్ర పోదామనుకున్న ఆ దంపతులను రాత్రి వేళలో మృత్యువు శాశ్వత నిద్రలోకి నెట్టింది. పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. వివరాలివి.. కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ఏనుగు దొరబాబు (53), వీరవేణి (45) దంపతులు వ్యాపారం నిమిత్తం కొన్నేళ్ల కిందట విశాఖ వచ్చి కొమ్మాదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రెండ్రోజుల క్రితం తమ కారులో విశాఖ నుంచి స్వగ్రామం కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ఉన్న దొరబాబు తల్లిదండ్రులను చూసిరావడానికి వెళ్లిన ఆ దంపతులు సోమవారం రాత్రి ఏడు గంటలకు తిరిగి కారులో విశాఖ బయల్దేరారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి కారు డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డులో యలమంచిలి నుంచి తుని వైపు జిప్సం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వీరవేణి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త దొరబాబును పోలీసులు యలమంచిలి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

మార్చురీలో విగతజీవులుగా..

యలమంచిలి మార్చురీలో విగత జీవులుగా ఒకేచోట కన్పించిన దొరబాబు, వీరవేణి దంపతులను చూసి బంధువులు చలించారు. పెళ్లయినప్పటి నుంచి ఒకరినొదిలి మరొకరు ఉండేవారు కాదని, ఎంతో అనురాగంగా వుండేవారని బంధువులు చెప్పారు. జీవితపు తుది మజిలీలో కూడా ఒక్కటిగానే అందనంత దూరాలకు వెళ్లిపోయారంటూ దుఃఖసాగరంలో మునిగిపోయారు.



ప్రమాదానికి గురైన కారు

ఆశలు అడియాసలు

దొరబాబు దుబాయ్‌లో, కాకినాడలో కొన్నాళ్లు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం చేశారు. తన పిల్లల చదువుల కోసమని కొన్నేళ్లుగా విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. తమ పిల్లలకు ఉన్నత భవిష్యత్తును ఇవ్వాలనే సంకల్పంతో నిత్యం కష్టపడుతూ వారిని ఆ దంపతులు చదివించుకున్నారు. తల్లిదండ్రులు ఆశించిన విధంగానే పెద్ద కుమారుడు బాగా చదివి కోల్‌కతాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. చిన్న కుమారుడు కూడా సీఏ పూర్తి చేసుకుని మంచి ఉద్యోగం సాధిస్తాడని మురిసిపోతున్న సమయంలో ఆ దంపతులను మృత్యువు కాటేసింది. కుమారులు అందివస్తున్న సమయంలో ఇద్దరూ దుర్మరణం పాలవడాన్ని వారి కుటుంబీకులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆనందంగా నవ్వుతూ వెళ్లిన వారు విగత జీవులుగా మంగళవారం సాయంత్రం ఇంటికి చేరుకోవడం బంధువులను, గ్రామస్తులను కలచివేసింది. ప్రమాదంపై ట్రాఫిక్ ఎస్‌ఐ బి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

సంఘటన స్థలిని పరిశీలించిన సీఐ

సంఘటన స్థలిని మంగళవారం ఉదయం యలమంచిలి సీఐ షేక్ గఫూర్ పరిశీలించారు. ఈ ప్రమాదానికి ఏమరుపాటు, అతివేగం కూడా కారణమై ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. రాత్రి వేళల్లో పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద లైటింగ్ లేకపోవడం వల్ల అంధకారం అలముకుంటోందని స్థానికులు సీఐకు చెప్పారు. దీంతో ఆయన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, హైవే నిర్వహణ సంస్థ ప్రతినిధులతో ఫోన్ ద్వారా మాట్లాడి, వీలైనంత త్వరగా ఈ హైవే జంక్షన్‌లో లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

అంబేడ్కర్‌కు అరుదైన గౌరవం

- 125 అడుగుల విగ్రహం, స్మృతివనంతో ఏపీ ఘన నివాళి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



దొండపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ధర్మశ్రీ

రావికమతం: విజయవాడలో ఏర్పాటు చేస్తున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం చరిత్రాత్మకమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. దొండపూడి గ్రామంలో మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 19న విజయవాడలో ఆ మహా కార్యక్రమం జరుగుతుందన్నారు. రూ.400 కోట్ల వ్యయంతో విగ్రహం ఏర్పాటుతోపాటు స్మృతి వనాన్ని కూడా తీర్చిదిద్దుతున్నారని, ఇది ఆ మహనీయునికి మన రాష్ట్రం అర్పిస్తున్న ఘన నివాళిగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన జన్‌భాగీదరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆ మహా కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు.

సీఎం జగన్‌మోహనరెడ్డి నాడు చేసిన ప్రజా సంకల్పయాత్ర ఏపీ దశ, దిశను పూర్తిగా మార్చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. పాదయాత్ర పూర్తయి ఐదేళ్లు అయిన సందర్భంగా తట్టబందలో ఆయన మాట్లాడారు.అన్ని వర్గాల బాధలు విని నవరత్నాలు ప్రవేశపెట్టారని చెప్పారు.

రూ.5614.22 కోట్లు

మహా బడ్జెట్ ఆమోదం

- 2024–25 ఏడాదికి ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు
- అన్ని పద్దుల కింద జమ రూ.4,949.89 కోట్లు
- ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమ రూ.5,614.22 కోట్లు
- అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5,457.23 కోట్లు
- ముగింపు నిల్వ రూ.156.99 కోట్లు
- ప్రతి వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, చిత్రంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ 2024–25 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. మేయర్ ప్రసంగించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రతిపక్షాలు పోడియంను చుట్టుముట్టి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించాయి. మేయర్ స్పందిస్తూ ఇది బడ్జెట్ ప్రత్యేక సమావేశం... కేవలం బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు మాత్రమే గౌరవ సభ్యులు మాట్లాడాలని సూచించారు. సమావేశం అయిన వెంటనే అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లతో తన చాంబర్‌లో సమస్యలపై మాట్లాడతానని హామీనిచ్చారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఎవరి సీట్లకు వారు వెళ్లిపోయారు. మెజార్టీ సభ్యుల అభీష్టం మేరకు మేయర్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం బడ్జెట్ కేటాయింపులను మేయర్ వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు. అన్ని పద్దుల కింద జమ రూ.4,949.89 కోట్లు. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తంగా జమ రూ.5,614.22 కోట్లు కాగా.. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5457.23 కోట్లు. ముగింపు నిల్వ రూ.156.99 కోట్లుగా నిర్ణయించినట్టు చెప్పారు. ఏఏ రంగానికి ఎంతెంత కేటాయించారో మేయర్ వివరించారు. ప్రతి వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

విద్యా విభాగం

బాల్యం పథకం కింద 3 నుంచి 7 ఏళ్లలోపు బాలలకు చిన్నబడి కార్యక్రమం కింద అంగన్వాడీ కేంద్రాలతో మున్సిపల్ పాఠశాలలు అనుసంధానం చేసి పౌష్టికాహారం, విద్య, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు రూ.2 కోట్లు, జీవీఎంసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, ప్రసూతి సెలవులు పూర్తయిన తర్వాత నెలల వయసు ఉన్న తమ శిశువులను ఉంచేందుకు వీలుగా ఏర్పాటుచేసిన శిశు సంరక్షణ కేంద్రం (సీఆర్‌ఈసీహెచ్) నిర్వహణకు రూ.50 లక్షలు, ఉద్యానవనం విభాగానికి సంబంధించి ప్రధాన, సాధారణ, కాలనీ పార్కులు, ట్రాఫిక్ ఐల్యాండ్స్, సెంట్రల్ మీడియన్, వర్టికల్, రూఫ్ గార్డెన్స్ నిర్వహణ, అభివృద్ధికి రూ.16.23 కోట్లు, వర్టికల్, రూఫ్‌గార్డెన్స్ నిర్వహణ, అభివృద్ధికి రూ.6.50 కోట్లు, మియావాకీ అడవుల నిర్వహణ, అభివృద్ధికి రూ.12.50 కోట్లు కేటాయించారు. ప్రజారోగ్యం విభాగానికి సంబంధించి రూ.95 కోట్లు కేటాయించారు.

మంచినీటి సరఫరాకు..

నగరంలో మంచినీటి సరఫరా పథకాల నిర్వహణకు రూ.40 కోట్లు, మంచినీటి సరఫరా పైపులైన్ల విస్తరణకు రూ.90 లక్షలు, గొట్టపు బావులు వేసేందుకు, నిర్వహణకు రూ.13.75 కోట్లు కేటాయించారు. రిజర్వాయర్ల నిర్మాణం, నిర్వహణకు రూ.15 కోట్లు కేటాయించగా, అమృత్ ప్రాజెక్టుకు రూ.51.20 కోట్లు, ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టు(ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రాజెక్టు)కు రూ.90 కోట్లు, కార్బన్ తీవ్రత నివారించేందుకు యూసీసీటీఆర్‌ఎఫ్ (అర్బన్ క్లైమేట్ ఛేంజ్ రిసైలెన్స్ ట్రస్ట్ ఫండ్) ప్రాజెక్టు ద్వారా స్వాపింగ్ స్టేషన్స్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు రూ.15 కోట్లు కేటాయించారు.



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

ఇంజనీరింగ్ పనులు ఇలా..

- జోన్–2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.55.30 కోట్లు కేటాయించారు.
- ఇంటిగ్రేటెడ్ జీవీఎంసీ కార్యాలయ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.80 కోట్లు కేటాయించారు.
- ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధికి రూ.45 కోట్లు కేటాయించారు.
- ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణానికి రూ.10 కోట్లు, రోడ్ల నిర్వహణ, గుంతలు పూడ్చడం కోసం రూ.16 కోట్లు, నగరంలో మురుగు నీటి కాలువ నిర్మాణం, నిర్వహణకు రూ.11.50 కోట్లు కేటాయించారు. సామాజిక భవనాల నిర్మాణానికి, నిర్వహణకు రూ.61 కోట్లు, వైఎస్సార్ క్లినిక్స్ నిర్మాణం, నిర్వహణకు రూ.13 కోట్లు, కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.10.50 కోట్లు, తారు రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లు, మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణకు రూ.5.70 కోట్లు కేటాయించారు.

సెలవుల్లో బోధిస్తే కఠిన చర్యలు

అనకాపల్లి: ఈనెల 18వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించినందున.. ఎక్కడైనా విద్యార్థులకు బోధించినట్లు కనిపిస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపడతామని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు తెరిచి విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

దగాపడ్డ జనానికి ధైర్యం చెప్పిన ‘యాత్ర’



కేక్ కట్ చేసి కిలపర్తికి తినిపిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- ప్రజల బాధలు చూసి నవరత్నాలకు రూపకల్పన
- ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు
- దేవరాపల్లిలో కేక్ కట్ చేసిన డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: గత చంద్రబాబు పాలనలో దగా పడ్డ ప్రజలకు ధైర్యం చెబుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్ర దేశ రాజకీయాల్లో చరిత్ర సృష్టించిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. పాదయాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం ఆవరణలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా సంబరాలు జరిపారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు కేక్ కట్ చేసి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావులకు తినిపించారు. డిప్యూటీ సీఎంకు పార్టీ శ్రేణులంతా కేక్ తినిపించారు. అనంతరం ముత్యాలనాయుడు మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపే విధంగా నవరత్నాల పథకాలకు రూపకల్పన చేశారన్నారు. పాదయాత్రలో తాను గుర్తించిన సమస్యలను నెరవేర్చే దిశగా ప్రజారంజక పాలనను సాగిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మి, ఉరుకుల గంగాభవాని, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

బుచ్చెయ్యపేట: విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పింఛన్‌దారుకు వలంటీర్ పార్వతి పింఛన్ నగదు అందించి మానవత్వం చాటుకుంది. వడ్డాదికి చెందిన కొరశాల వరహాలు అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి నగదు అందించింది.

జిల్లా రెజ్లింగ్ అధ్యక్షుడిగా మాణిక్యం


వెంకటరమణను సత్కరిస్తున్న నూతన కార్యవర్గం

అనకాపల్లి: జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడాకారులు క్రీడను మరింత బలోపేతం చేయాలని ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రైవేటు హోటల్లో క్రీడా ప్రోత్సాహకుల సమావేశంలో జిల్లా రెజ్లింగ్ కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షునిగా మళ్ల మాణిక్యం, కార్యదర్శిగా నంబారు హేమసాయి, ఉపాధ్యక్షునిగా డీవైడీపీ సతీష్, కోశాధికారిగా సూరిశెట్టి ఉదయ్, సహాయ కార్యదర్శులుగా కేదారిశెట్టి ప్రవల్లిక, బొడ్డేటి చంద్రమౌళి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా శిలపరశెట్టి బాబీ, సభ్యులుగా కర్రి సత్యనారాయణ, లెక్కల కిశోర్, శరగడం సురేంద్ర, కోన అప్పలరాజు, కాండ్రేగుల మహేందర్, మద్దాల గణేష్, పోతుల సత్యప్రసాద్, అడారి జ్యోష్న ఎన్నికయ్యారు. అంతకుముందు నూతన కార్యవర్గం వెంకటరమణను ఘనంగా సత్కరించింది.

చరిత్రలో నిలిచేలా గ్రామాల్లో అభివృద్ధి


నాగయ్యపేట-కడకొండ తారురోడ్డును రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


దేవరాపల్లి-చిననందిపల్లి తారురోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- దేవరాపల్లి, నాగయ్యపేటలో రూ.5.40 కోట్లతో 10 పనులు ప్రారంభం

దేవరాపల్లి: చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని దేవరాపల్లి, నాగయ్యపేట పంచాయతీల పరిధిలో రూ. 5.40 కోట్లతో పూర్తి చేసిన పది అభివృద్ధి పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు. మహిళల కోలాటం, తీన్మార్ వాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. నాగయ్యపేటలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 23.94 లక్షలతో ఆర్బీకే, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, నాగయ్యపేట నుంచి కడకొండకు రూ.1.25 కోట్లతో 1.36 కి.మీ మేర నిర్మించిన తారురోడ్డును రిబ్బన్ కత్తిరించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. దేవరాపల్లిలో సచివాలయ -2 భవనాన్ని, ఆర్బీకే-2, రూ. 2 కోట్లతో నిర్మించిన దేవరాపల్లి-చిననందిపల్లి తారురోడ్డును ప్రారంభించారు. దేవరాపల్లి- ఆనందపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొరుపోలు కల్లాలకు ఎడమ కాలువ వైపు రూ.20 లక్షలు, కుడి వైపు రూ.19.94 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లును, ఆంధ్రవీధిలో రూ. 20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల మధ్య మట్టి రోడ్లన్నింటినీ తారురోడ్లుగా నిర్మించామని, ఈ ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, కర్రి పుష్ప, ఎంపీటీసీలు వంటాకు పైడితల్లమ్మ, మొల్లి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మి, ఉగ్రూకుల గంగాభవానీ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి. సింహాచలంనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి పాల్గొన్నారు.


దేవరాపల్లి ఎంపీపీ రాజేశ్వరితో కలిసి రైతు భరోసా కేంద్రం ప్రారంభం..

సీఎం జగన్ విజన్‌తో పల్లెల ప్రగతి

- రూ.9 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన విప్ ధర్మశ్రీ


పి.పొన్నవోలులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

రావికమతం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో గ్రామాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో తట్టబంద, జెడ్.బెన్నవరం, కిత్తంపేట, మరుపాక, పి.పొన్నవోలు, దొండపూడి గ్రామాల్లో రూ.9 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాలు, జల జీవన్ మిషన్ అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తట్టబంద గ్రామ సభలో ఆయన మాట్లాడారు. నాడు చంద్రబాబు హయాంలో ఏ పని కావాలన్నా రావికమతం వెళ్లాల్సి వచ్చేదని, నేడు సీఎం జగన్ సచివాలయాలను స్థాపించి పనులన్నీ గ్రామంలోనే చేసేలా చర్యలు చేపట్టారన్నారు. ఆర్బీకేతో రైతులకు అన్నీ అందుబాటులోకి తెచ్చారన్నారు. వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌తో గ్రామంలోనే వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని, వాటికి నూతన భవనాలను సైతం కోట్లు వెచ్చించి నిర్మించామన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ఏపీ ముందంజలో ఉందన్నారు. ఇటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ పాల్గొన్నారు.

రూ.3వేల కోట్లు టర్నోవర్ లక్ష్యంగా డీసీసీబీ

- త్వరలో నాతవరంలో నూతన బ్రాంచి ఏర్పాటు
- డీసీసీబీ జనరల్ మేనేజరు బి.శ్రీనివాసరావు


నాతవరంలో కొత్తగా ఆర్‌డీలు కట్టిస్తున్న జనరల్ మేనేజరు శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది

నాతవరం : ఉమ్మడి జిల్లాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)కు రూ.2,150 కోట్లుగా గల టర్నోవర్‌ను, రూ.3వేల కోట్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జనరల్ మేనేజరు బి.శ్రీనివాసరావు అన్నారు. నాతవరం పీఏసీఎస్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి పీఏసీఎస్ టర్నోవర్, ఇతర అంశాలను సీఈవో ఆదినారాయణను అడిగి తెలుసుకున్నారు. తర్వాత గ్రామంలో ఇంటింటికీ తిరిగి పలువురితో కొత్త ఖాతాలు తెరిపించారు. పోస్టాఫీస్ మాదిరిగానే 150 మందికి పైగా ఆర్‌డీలు చేయించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ బ్యాంకులకు దీటుగా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 98 సహకార సంఘాలు, 30 బ్రాంచిలు ఉన్నాయని, ఇటీవల కొత్తగా రెండు ప్రాంతాల్లో నూతన బ్రాంచిలు ప్రారంభించామని తెలిపారు. రూ.1250 కోట్లు రుణాలందించగా, రూ.890 కోట్లు డిపాజిట్లు కలిగి ఉన్నట్టు తెలిపారు. కొత్తగా మరో 12 బ్రాంచిలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అందులో ఒక బ్రాంచి నాతవరంలో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో నాతవరంతో పాటు పి.కె. గూడెం, గన్నవరం పీఏసీఎస్‌లకు మరిన్ని రుణాలు అందించడానికి వీలుపడుతుందన్నారు. నిబంధనల మేరకు రూ.20లక్షల వరకు వ్యవసాయ రుణాలు, రూ.40లక్షల వరకు వ్యవసాయేతర రుణాలు అందిస్తామన్నారు. డ్వాక్రా సంఘాలకు తక్కువ వడ్డీలకే రూ.50కోట్లకు పైగా రుణాలు అందించామన్నారు. కార్యక్రమంలో నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు నోడల్ అధికారి ఎం.రామకృష్ణ, చీఫ్ మేనేజర్లు కె.వి.ఎస్.రామకృష్ణ, కిశోర్, కోటవురట్ల బ్రాంచి మేనేజర్లు శ్రీనివాసరావు ఎం.అప్పారావు, నాతవరం పి.కె.గూడెం పీఏసీఎస్‌ల సీఈవోలు ఆదినారాయణ, రామారావు పాల్గొన్నారు.

నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు

- బుచ్చెయ్యపేట ఎంపీపీకి పరామర్శ


నాగరాజు భౌతికాయం వద్ద నివాళులర్పిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాగరాజు మృతి పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన గుండెపోటుకు గురై కోమాలోకి వెళ్లిపోయి మృతి చెందడం బాధాకరమన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి విప్ ధర్మశ్రీ సీతయ్యపేటలో ఎంపీపీ ఇంటికెళ్లి నాగరాజు పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నాగరాజు మృతి పట్ల మండల నాయకులు, ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. పంజాబ్‌లో ఆర్మీ విధుల్లో ఉన్న ఎంపీపీ చిన్న కుమారుడు కిశోర్ రావడం ఆలస్యమవడంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, అధికారులు సంతాపం తెలియజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


చంటిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: మండలంలో ఊడేరు పంచాయతీ అల్లిఖానుడుపాలెం టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకర చంటి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఆయనకు అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ఆకర్షితులయ్యానని తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తమ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, కార్యకర్తలకు ఇస్తున్న భరోసాను చూసి పార్టీలో చేరినట్టు చెప్పారు. 15 ఏళ్లుగా టీడీపీకి సేవ చేసినప్పటికీ ఎటువంటి గుర్తింపు లేదన్నారు. కేవలం కార్యకర్తగా వాడుకున్నారని బాధను వెల్లబోసుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద, పార్టీ నేతలు పెద్దాడ రాంశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నా.. చిల్లర వేషాలు మానుకో..

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆగ్రహం



నర్సీపట్నం: చిల్లర వేషాలు మానుకోవాలంటూ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది క్రితమే పట్టణంలోని ప్రధాన రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేసిన విషయం తెలుసుకోవాలన్నారు. ఒక దగ్గర 80 అడుగులు, ఇంకొక దగ్గర 90 అడుగులు చేస్తున్నామని విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి మంత్రిగా ఆర్నెల్లకొకసారి రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు ప్రకటనలు చేసి చిల్లర దండుకున్న అయ్యన్న తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అతనికి సాధ్యం కానిది తాను చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నాడని ఎద్దేవా చేశారు. రోడ్డు విస్తరణను ప్రజలు హర్షిస్తున్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. దీనికి సహకరించాల్సింది పోయి, విమర్శలు చేయటం అతని చేతకాని తనానికి నిదర్శనమన్నారు.

రత్నంపేటలో వరి కుప్పలు దగ్ధం

- మంటల్లో కాలిపోయిన పాక


కాలి బూడిదయిన వరి కుప్ప

రోలుగుంట: మండలంలోని రత్నంపేటలో సోమవారం ఊడి వారి పాకల వద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పది వరి కుప్పలు, ఒక పాక దగ్ధమయ్యాయి. ఇక్కడ పాకలున్న రైతులు ఎప్పటి మాదిరిగానే పనులు ముగించుకుని చీకటిపడ్డ తర్వాత ఇళ్లకు చేరుకున్నారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో పొగలతో కూడిన మంటలు రావడంతో రైతులు వడివడిగా అక్కడకు వెళ్లారు. అప్పటికే పది వరికుప్పలు, పక్కనే పాక కాలి బూడిదయ్యాయి. బాధిత రైతుల్లో గ్రామానికి చెందిన ఊడి వెంకట రమణ(ఉప సర్పంచ్), శెట్టి శ్రీను, చింతాడ అప్పారావు, కిర్లంపల్లి అప్పారావు, ఊడి గోవింద, అప్పలనాయుడు, సోంబాబు తదితరులున్నారు. చేతికందిన పంట కాలిపోవడంతో వారంతా తీవ్రంగా రోదిస్తున్నారు. గిట్టని వారు ఈ పని చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.


బాల కార్మికులను పనుల్లో చేర్చుకుంటే కేసులు

- చోడవరంలో హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో కార్మికశాఖ తనిఖీలు


షాపింగ్‌మాల్‌లో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

చోడవరం: బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే యజమానిపై చర్యలు తీసుకుంటామని చోడవరం డివిజన్ సహాయ కార్మిక అధికారి పి. సూర్యనారాయణ హెచ్చరించారు. ‘ఆపరేషన్ స్వేచ్ఛ’లో భాగంగా పలు షాపింగ్‌మాళ్లు, హోటళ్లు, దుకాణాల్లో అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. 18 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం నేరమని, ఆ విధంగా చేర్చుకుంటే షాపు యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. అదేవిధంగా కార్మికులకు బెంచీలు, మంచినీరు సదుపాయాలు విధిగా కల్పించాలని సహాయ కార్మికాధికారి సూచించారు. తనిఖీ బృందంలో చోడవరం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అప్పలనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, లోవరాజు, నీడ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి చిన్నారావు ఉన్నారు.

వాడ్రాపల్లి ఆవలో మత్స్యకారుడి మృతి


గంగరాజు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

మునగపాక: చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మంగళవారం మృతి చెందిన సంఘటన మండలంలోని వాడ్రాపల్లిలో చోటు చేసుకుంది. వాడ్రాపల్లికి చెందిన పిల్లి గంగరాజు(58) స్థానిక ఆవలో చేపల వేట సాగిస్తూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగానే మంగళవారం తెల్లవారు తాటిదోనెపై చేపల వేటకు వెళ్లాడు. అతడి వెళ్లిన తర్వాత ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆవలో గాలించారు. ఈ క్రమంలో మృతదేహం లభ్యమైంది. అయితే గంగరాజు మృతికి కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్ ఆలీ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం


బెల్లం పులుపును స్వాధీనం చేసుకున్న ఎస్సై, సిబ్బంది

నర్సీపట్నం: మండలంలోని గురందరపాలెం సారా తయారీ చేస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్సై ధనుంజనాయుడు సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

‘సంకల్ప యాత్ర’తో సంక్షేమ రాజ్య స్థాపన

- పాదయాత్ర పేటెంట్ వైఎస్ కుటుంబానిదే
- సమన్వయకర్త కంబాల జోగులు


నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న కంబాల జోగులు

నక్కపల్లి: ప్రజా సంకల్ప యాత్రలో తెలుసుకున్న సమస్యలను పరిష్కరించడం ద్వారా జగనన్న సంక్షేమ రాజ్యాన్ని స్థాపించారని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి కంబాల జోగులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ పాదయాత్ర పేటెంట్ ఒక్క వైఎస్ కుటుంబానికే దక్కుతుందన్నారు. జగనన్న 3,648 కిలోమీటర్ల మేర చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలోను పర్యటించి అన్ని వర్గాల సమస్యలు స్వయంగా తెలుసుకున్నారన్నారు. ఆ నమ్మకంతోనే ప్రజలు 151 స్థానాలతో అధికారం కట్టబెట్టారన్నారు. వాటి పరిష్కారానికి అధికారంలోకి వచ్చిన వెంటనే 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగ ఈశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మణిరాజు, పాపారావు సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, వెదుళ్ల రమణ, రత్నకుమారి, సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు తిరుపతిరావు, గొర్ల గోవిందు, పార్టీ నాయకులు ఎల్లేటి సత్తిబాబు, అల్లాడ కొండ, ఎం.తాతారావు, కాకర వెంకటరరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో డేటా ఎంట్రీ ఆపరేటర్ మృతి

- మృతదేహంతో సీఆర్పీల ఆందోళన
- రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని డీఈవో వెల్లడి

మునగపాక/అనకాపల్లి: మునగపాక ఎంఆర్‌సీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా సేవలందిస్తున్న జె.వాసుదేవ్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. మునగపాకలో నివాసం ఉంటున్న వాసుదేవ్ (35) కొంతకాలంగా ఎంఆర్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. 15 రోజుల క్రితం అస్వస్థతకు లోనై ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన మంగళవారం మృతి చెందారు. సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న సీఆర్పీలు ఈ విషయం తెలుసుకొని ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఉంచి, స్థానిక నెహ్రూచౌక్ మీదుగా డీఈవో కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి - విశాఖ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కావడంతో టీడీపీ నేత ఆడారి కిశోర్‌ను గ్రామీణ సీఐ రవికుమార్ అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీపై విడుదల చేశారు. మృతుడు వాసుదేవ్‌కు భార్య, పాప ఉన్నారు. అతని అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం మునగపాకలో నిర్వహించారు.

వాసుదేవ్‌కు ప్రభుత్వం నుంచి రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, దహన ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశామని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. ఆమె వాసుదేవ్ విషయాన్ని కోల్‌కతా పర్యటనలో ఉన్న మంత్రి అమర్‌నాథ్‌కు వివరించగా.. ప్రభుత్వం నుంచి పది లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి వంజంగి హిల్స్‌కు అనుమతి

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌కు ఈనెల 10వతేదీ బుధవారం నుంచి పర్యాటకులను అనుమతిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంజంగి హిల్స్‌లో స్వచ్ఛ కార్యక్రమాలను పురస్కరించుకుని వారం రోజుల పాటు పర్యాటకులను అనుమతించలేదన్నారు. ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలను కార్మిక సిబ్బంది తొలగించారని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలను నరికివేయడంతో పాటు రోడ్డును అభివృద్ధి చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

హిల్స్‌పై ప్లాస్టిక్ నిషేధం

వంజంగి కొండలపై ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలుజేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటకులు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ సామగ్రిని తీసుకురావద్దన్నారు.ప్లాస్టిక్ వస్తువులలో తాగునీరు,ఆహారం తదితర సామిగ్రిని కొండపైకి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు.


వంజంగిలో సిబ్బంది సేకరించిన చెత్త

క్లుప్తంగా

నేడు వీక్షిత్ భారత్‌పై డిబేట్

అనకాపల్లి : స్థానిక గౌరీ గ్రంథాలయంలో వీక్షిత్ భారత్ 2047 అంశంపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం డిబేట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ అధికారి గొర్లి మహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే వారు జిల్లాకు సంబంధించిన వారై ఉండాలని, 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సుతో పాటు ఆధార్, నివాస ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని, రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ. 25 వేలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8074605109, 9247166511 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని ర్యాలీ

అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాది సాయిలక్ష్మణ్ డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో మానవహారంగా ఏర్పడి చట్టాన్ని రద్దు చేయాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించడంతో పాటు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో తాము కోర్టులను బహిష్కరించామన్నారు. అంతకు ముందు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్, సాయిలక్ష్మణ, రామారావు, కుమార్, నాయుడు పాల్గొన్నారు.

పిన్నికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న జగదీష్

కశింకోట : అవివాహిత అయిన పిన్ని మృతి చెందడంతో అక్క కుమారుడు (వరుసకు కుమారుడు) అంత్యక్రియలు జరిపించారు. ఈ ఘటన మంగళవారం కశింకోటలోని గవరపేటలో జరిగింది. లక్కోజు చిట్టిమణి (60) అకస్మాత్తుగా మృతి చెందారు. ఆమెకు వివాహం కాలేదు. దీంతో అక్క కుమారుడు జగదీష్ బంధువులు, స్థానికుల సహకారంతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక సాధుమఠం శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపించారు.

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	:	రాజా
కపాలదీవి	:	సత్యనారాయణస్క్రీన్-1
దీనమ్మ జీవితం	:	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	:	షిర్డిసాయి
సలార్	:	పర్డిసాయి
రాఘవరెడ్డి	:	వెంకటేశ్వర
తికమక తాండ	:	శ్రీసత్య
సలార్	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,358 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,990	4,210
మొదటి రకం	3,740	4,370
రెండో రకం	3,600	3,940
మూడోరకం	3,350	3,690

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ×ఎ= పాజిటివ్-1 యూనిట్లు, ×బి= పాజిటివ్-10 యూనిట్లు, ×ఒ= పాజిటివ్-14 యూనిట్లు, ×ఎబి= పాజిటివ్-4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 411 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఇది కదా అభివృద్ధి

మార్గం సుగమం



కశింకోటలోని హౌసింగ్ కాలనీకి జాతీయ రహదారి నుంచి నిర్మించిన ప్రధాన సిమెంట్ రోడ్డు



నా పేరు కొల్లి మాలినాయుడు. చాలా కాలంగా ఇక్కడి జాషువా కాలనీలో నివాసం ఉంటున్నాను. ఏ మాత్రం వర్షం వచ్చినా మా ప్రాంతంలో నీరు నిల్వ ఉండిపోయి రాకపోకలకు ఇబ్బంది పడే పరిస్థితి. వర్షా కాలంలో ఊట నీటి ప్రవాహం మరింత ఇబ్బందికి గురి చేసేది. గతంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. తాజాగా ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు సమకూర్చారు. దీంతో సిమెంట్ రోడ్లు వేయడంతో ఇబ్బందులు తొలిగాయి. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేసి కష్టాలు తీర్చినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.



నా పేరు ద్వారపురెడ్డి రాములమ్మ. హౌసింగ్ కాలనీలో దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కుటుంబంతో నివసిస్తున్నాను. నా భర్త నాగేశ్వరరావు కూలీ. నలుగురు ఆడ పిల్లలు, ఒక మగ సంతానం. కాలనీలో మట్టి రోడ్డు ఉండటం వల్ల ఏ మాత్రం వర్షం పడినా మా ఇంటి పరిసరాలు బురదగా మారి అష్టకష్టాలు పడే వాళ్లం. గతంలో ఎంత మందికి విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తాజాగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. ప్రధాన రహదారితో పాటు మా ఇంటి వద్ద కూడా అంతర్గత సిమెంట్ రహదారి నిర్మించడంతో మా కష్టాలు తీరాయి.

నూతన రహదారి నిర్మాణంతో స్థానికుల కష్టాలకు చెక్

వర్షాకాలంలో సులువుగా రాకపోకలు సాగిస్తున్నామని హర్షం

కశింకోట : స్థానిక హౌసింగ్ కాలనీలో రూ.35 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లతో ఈ ప్రాంతానికి కొత్త కళ వచ్చింది. చిన్నపాటి వర్షానికే ఇబ్బంది పడే ఇక్కడి ప్రజలు సిమెంట్ రోడ్లు నిర్మించడంతో ఇబ్బందులు తొలగాయని ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం-2 పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో ఎక్కువ మంది ఎస్సీలు నివసిస్తున్నారు. వీరితో పాటు బీసీలు, ఇతర కులస్తులు కూడా ఉన్నారు. వీరు పీఎస్‌ఎస్ ఎదురుగా జాతీయ రహదారి నుంచి కాలనీకి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు ఏ మాత్రం వర్షం పడినా బురదమయంగా మారిపోయేది. నీరు నిల్వ ఉండిపోయి, ఊట నీటి సమస్య వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ కాలనీని పరిశీలించి సమస్యను గుర్తించిన అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి స్పందించి తన ఎంపీ నిధుల నుంచి రూ.35 లక్షలు మంజూరు చేశారు. దీంతో జాతీయ రహదారి నుంచి 2వ సచివాలయ భవనం వరకు ప్రధాన సిమెంట్ రోడ్డు, అంతర్గత రోడ్లు నిర్మించారు. దీంతో ఇక్కడి గుర్రం జాషువా కాలనీ, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీకి రహదారి సదుపాయం మెరుగుపడటంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సిమెంట్ రోడ్లు నిర్మించి ఇబ్బందులు తొలగించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



హౌసింగ్ కాలనీలో అంతర్గత సిమెంట్ రోడ్లు



ఇబ్బందులు తొలిగాయి..



హౌసింగ్ కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించి సౌకర్యాలు మెరుగుపరిచారు. లేదంటే గతంలో రాకపోకలకు ఇబ్బంది పడేవారం. ఇప్పుడు రోడ్ల నిర్మాణంతో సౌకర్యం మెరుగుపడి ఇబ్బంది తొలగినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

–ఒరేల నూకరాజు, ఎస్సీ కాలనీ

రహదారి సదుపాయం మెరుగైంది..



జాతీయ రహదారి నుంచి హౌసింగ్ కాలనీకి రోడ్డు నిర్మించడం వల్ల గుర్రం జాషువా కాలనీ, ఎస్సీ కాలనీకి రహదారి సదుపాయం మెరుగుపడింది. ఇందుకు ఎంతో ఆనందంగా ఉంది.

–చెంగల ఉట్టమ్మ, గుర్రం జాషువా కాలనీ

విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులు పాటించాల్సిందే

తుమ్మపాల : ఈ నెల 9 నుండి 18వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులను అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పక పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పెద్ద పండగను కుటుంబ సభ్యులంతా ఒకే వేదికగా చేసుకుంటారని, సుదూర ప్రాంతాలు ప్రయాణిస్తారని తెలిపారు. అటువంటి సంప్రదాయ పండగ సెలవులను కాదని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను యాజమాన్యాలు ప్రత్యేక తరగతుల నిర్వహణ పేరిట మానసికంగా వేధిస్తే బాలల హక్కుల కమిషన్ చూస్తూ ఊరుకోబోదని తెలిపారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులు, ఇంటర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ సెలవులు అమలు చేయడంలో ఎవరికి ఎటువంటి మినహాయింపులు ఉండబోవని పేర్కొన్నారు . ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని స్కూళ్లు, కాలేజీల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫారసు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయమై ఏపీఎస్‌సీపీసీఎస్2018జీమెయిల్.కామ్‌కు ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు చేపడతామని తెలిపారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ

కశింకోట : మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఐదు ఆటల్లో సుమారు 200 మంది బాల బాలికల పాల్గొంటారన్నారు. బయ్యవరం హైస్కూలు, నూతలగుంటపాలెం మైదానంలో క్రికెట్ పోటీలు, కశింకోట బాలికల హైస్కూల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ నిర్వహించడానికి సన్నాహాలు చేశామన్నారు. సచివాలయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అర్హత సాధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయన్నారు.

అందరికీ భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష



రోగితో మాట్లాడుతున్న వైద్యాధికారి వాణి జగదీశ్వరి



రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది



నేత్రరోగికి కంటి అద్దాలు అందిస్తున్న ఎంపీడీవో నర్సింహారావు, పెంటయ్యనాయుడు

అనకాపల్లి : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ప్రజలు పలు వ్యాధులకు గురయ్యే అవకాశముందని తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. సచివాలయం-1 హైస్కూల్ ఆవరణలో మంగళవారం మలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలి విడతలో ప్రతి గ్రామంలోను శిబిరాలకు అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. శిబిరంలో ఒక ఫ్యామిలీ వైద్యుడు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, నేత్ర వైద్యుడు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్సకు ఎంపికైన రోగులను ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించి వైద్యం అందిస్తున్నామన్నారు. చికిత్స పొందిన అన్ని రోజులు ప్రభుత్వం రోగికి ఆర్థిక సహాయంగా నగదు అందివ్వడం అభినందనీయమన్నారు. అంతకు ముందు తొలి విడతలో నేత్ర శస్త్ర చికిత్సలు చేయించుకున్న ఐదుగురికి ఉచితంగా కంటి అద్దాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నర్సింహారావు, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యులు సమీం, వాణి జగదీశ్వరి, ఈవోఆర్డీ ధర్మారావు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, పార్టీ నేతలు పీడీ గాంధీ, విల్లూరి చంద్రశేఖర్, పంచదార్ల కన్నారావు, సత్యనారాయణ, పడాల గణపతి పాల్గొన్నారు.

పరీక్షలు చేసి.. మందులిచ్చారు..



మా కుటుంబం అంతా జ్వరం, విపరీతమైన దగ్గుతో బాధపడుతున్నాం. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంలో వైద్యులతో పరీక్షలు చేయించుకోవడంతో కొంత భయం తగ్గింది. ఇక్కడ అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందించారు. పైసా ఖర్చు లేకుండా వ్యాధి పట్ల అప్రమత్తమయ్యా. శిబిరంలో పరీక్షలు చేయడంతో ఇప్పుడు ప్రశాంతంగా ఉంది.

– లంబా కుమారి, తుమ్మపాల

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



రంగువల్లులు వేస్తున్న బాలికలు

కశింకోట : మండలంలోని గాయత్రి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు, బుడబుక్కల వాని వేషధారణతో అలరించారు. భోగి మంటలు వేశారు. దాని చుట్టూ నృత్యం చేస్తూ బాలికలు కోలాటం ఆడారు. బాలురు గాలి పటాలను ఎగుర వేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ వై. నగేష్, యాజమాన్య సభ్యులు జీవీఎస్ రమేష్‌కుమార్, బి. నరసింహమూర్తి, రిటైర్డు టీచర్ జి. సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



గవరపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పెంటకోట జ్యోతి

కశింకోట : మండలంలో పెంచిన పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కశింకోటలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని పింఛన్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్ తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్. రమేష్ పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా మండలంలో సోమ, మంగళవారాల్లో సుమారు 90 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పునర్జన్మనిచ్చిన సీఎం జగన్



కార్యక్రమంలో పాల్గొన్న సూరిశెట్టి రమణ అప్పారావు, నాయకులు

అనకాపల్లి : కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరో జన్మనిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీరోగుల కోసం రూ.700 కోట్లతో మంచినీటి శుద్ధి ప్లాంట్ నిర్మించి 2 వేల మందికి మరో జన్మనిచ్చారని అన్నారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, దేవస్థానాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కెఎం నాయుడు, సకలా రాజ్యలక్ష్మి, పార్టీ సీనియర్ నేతలు దాడి నారాయణరావు, గైపూరి రాజు, సకలా గోవింద్, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



డెమో ద్వారా ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వోలు

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈవీఎంల ద్వారా ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో స్థానిక గవరపాలెం జీవీఎంసీ చినహైస్కూల్, కస్పావీధి ఎలిమెంటరీ పాఠశాలల్లో మంగళవారం బీఎల్‌వోలు డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలో ఈవీఎంల ద్వారా తెలుసుకున్నామని పలువురు పేర్కొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అప్పారావు తదితరులు

అనకాపల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు అన్నారు. స్థానిక ఉడ్‌పేట సచివాలయం-8లో మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ పరిధిలో జన్‌భగీరథి వేడుకలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

బుద్ధావతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట : స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి మంగళవారం బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన బుద్ధునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విష్ణు సహస్ర నామార్చన, తిరుప్పావై, పాశుర విన్నపం పారాయణం చేశారు. ఈ నెల 11 వరకు స్వామి ఇదే అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న అన్నపూర్ణ

రావికమతం: దివ్యాంగుల సేవ దైవ సేవతో సమానమని చోడవరం ఫోర్ జీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తెలిపారు. మండలంలో పదో తరగతి చదువుతున్న 20 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.10 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్, రగ్గులు, పరీక్ష అట్టలను ఆమె మంగళవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా మేడివాడ హైస్కూల్‌లో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హెచ్‌ఎం రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండటమే సీఎం లక్ష్యం

మాకవరపాలెం: పేదలకు అండగా ఉండటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైస్ ఎంపీపీ తుల్లు రాజారావు, వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి భీమిరెడ్డి గోవింద అన్నారు. మంగళవారం రామన్నపాలెంలో ఆయన లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛను కానుకగా రూ.3 వేల నగదు పంపిణీ చేశారు. బూరుగుపాలెం సచివాలయం వద్ద లబ్ధిదారులతో కలసి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్తించి, మరలా జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రామన్నపాలెం సర్పంచ్ మాకిరెడ్డి అయ్యప్ప, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దగ్గుపల్లి సాయిబాబా

పాయకరావుపేట : గజపతినగరం గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెల రోజులకు సరిపడే విధంగా బియ్యం, కూరగాయలు నిత్యావసర సరుకులు అందించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే విధంగా ప్రయత్నం చేస్తామని బాధితులైన కాకాడ కొండయ్యకు, కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌వో కాకాడ కృష్ణ, గ్రామ వలంటీర్ ఏడిద కృష్ణ, ఏడిద నాగరాజు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కోటవురట్ల : వైఎస్సార్ పశు బీమా పథకంతో పాడి రైతులకు కొండంత భరోసా అందుతోందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రప్పుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పశు బీమాను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా పశువులు, జీవాలు, పందులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు.

బీమా ఇలా.. : రెండు నుంచి 10 ఏళ్ల వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన ఆవులకు, 3 నుంచి 13 ఏళ్ల వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన గేదెలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఒక కుటుంబం గరిష్టంగా 5 పశువుల వరకు బీమా సదుపాయం కల్పించుకోవచ్చని తెలిపారు. 6 నెలల పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు పథకం వర్తించనుండగా ఒక కుటుంబం గరిష్టంగా 50 జీవాల వరకు బీమా చేసుకోవచ్చని తెలిపారు. దేశవాళీ, సంకరజాతి పశువులకు రూ.30 వేలు, నాటు జాతికి చెందిన పశువులకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేలు వరకు బీమా సౌకర్యం ఉన్నట్టు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, సంఘ నాయకులు

చోడవరం: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని చోడవరం సీఐ శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సంక్షేమానికి అంబేడ్కర్ ఆశయ సాధనకు సంఘాలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జయలక్ష్మి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చందోలు వెంకటేశ్వరరావు, రిటైర్డ్ లెక్చరర్ నడుపూరి దేముడు మాస్టారు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, అంబేడ్కర్ భవనం కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఎంఎస్ భాస్కరరావు, మత్స్యలింగం, చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ, కె.కోటపాడు మండలాలకు చెందిన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.